ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 3 సెప్టెంబరు 2024 | 5





గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో మునిగిన పొలాలను చూపిస్తున్న రైతు వడ్డీ ఏసుబాబు

పవన్‌కల్యాణ్ బర్త్‌డే సంబరాలు



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా ఆయన అభిమానులు, జనసేన, టీడీపీ కూటమి నాయకులు సోమవారం ఘనంగా జరిపారు. రక్తదానాలు, ఉచిత వైద్య శిబిరాలతోపాటు అన్నదానం, రోగులకు పాలు పండ్లు పంపిణీ తదితర కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వివిధ చోట్ల వేడుకల్లో పాల్గొన్నారు. సామర్లకోట పట్టణంలోని జయలక్ష్మి థియేటర్ ఆవరణలో జనసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట రమణ తదితరులు కేక్ కట్ చేస్తున్న దృశ్యం. - సామర్లకోట



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

పరిశ్రమల్లో తప్పనిసరిగా సెన్సార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబర్2: ప్రమాదాలను ముందుగానే పసిగట్టి, సిబ్బందిని అప్రమత్తం చేసేలా ప్రమాదకర పరిశ్రమల్లో తప్పనిసరిగా అలారం, సెన్సార్ వ్యవస్థను అమర్చాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పరిశ్రమల ప్రతినిధులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి జిల్లాలోని పరిశ్రమల భద్రతపై జిల్లా సంక్షోభ నివారణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో ఎన్టీఆర్ అనకాపల్లి జిల్లాల పరిశ్రమల్లో చోటుచేసుకున్న ప్రమాద సంఘటనల నేపథ్యంలో కాకినాడ జిల్లాలో జూలై నెల నుంచి ప్రమాదకర పరిశ్రమల్లో వివిధ శాఖల అధికారులతో ఉమ్మడి వరుసగా తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రధానంగా 14 ప్రమాదకర పరిశ్రమలను గుర్తించినట్టు తెలిపారు. చాలా పరిశ్రమల్లో మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలను ముందుగానే పసిగట్టి, సిబ్బందిని అప్రమత్తం చేసేలా ప్రమాదకర పరిశ్రమల్లో అలారం, సెన్సార్ వ్యవస్థను అక్టోబర్ 15 నాటికి అమర్చాలన్నారు. ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతా తనిఖీలకు సంబంధించిన ఆడిట్ ఇతర వివరాలను సమర్పించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుతీరు, ప్రమాదకర రసాయనాలు తయారీ, నిల్వల వివరాలు, ప్రమాద సంఘటనలు చోటుచేసుకునే సందర్భాల్లో పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమీక్షించారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సందీప్, ఏపీఐఐసీ జెడ్ఎం రమణారెడ్డి, డీఐసీ కృష్ణార్జునరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రాణి, ఇన్‌చార్జి అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

సకాలంలో సమస్యలు పరిష్కరించండి : ఎస్పీ

కాకినాడ క్రైం, సెప్టెంబరు 2: వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అధికారులకు సూచించారు. ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 52 మంది అర్జీదారులు గ్రీవెన్స్‌కు హాజరై తమ గోడును ఎస్పీకి విన్నవించారు. ఎస్పీ ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫిర్యాదుదారుల సమక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదుచేసి దర్యాప్తును వేగవంతంగా పూర్తిచేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

గొల్లప్రోలులోని జగనన్న కాలనీ సమీపంలో వరి చేలల్లోకి పోటెత్తుతున్న వరద



సుద్దగడ్డ ముంచేసింది!

సుద్దగడ్డ పొంగింది.. వరద తీవ్రత పెరిగి మహోగ్రరూపం దాల్చింది. ఊళ్లను ఏర్లుగా మార్చేసింది. పంట పొలాలను నదుల్ని తలపించేలా చేసింది. చివరకు జాతీయ రహదారినీ ముంచేసింది.. వెరసి భారీ వర్షాలకు మునుపెన్నడూ లేని విధంగా సుద్దగడ్డ పొంగడంతో జిల్లాలోని గొల్లప్రోలు మండలం వణికిపోయింది. వేలాది ఎకరాల వరి, వాణిజ్య పంటలను తుడిచిపెట్టేయడంతోపాటు అనేక కాలనీల్లోకి సైతం వరదనీరు చేరడంతో ఎటుచూసినా మండలంలో అనేక గ్రామాలు చెరువులను తలపించాయి. దీంతో వందలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్ల నుంచి బయటకు రాలేక నరకయాతన పడ్డారు. విషయం తెలిసిన ప్రభుత్వం బోట్లలో కాలనీలకు వెళ్లి నిత్యావసర సరుకులను అందించింది. అటు భారీ వర్షాలతో జిల్లావ్యాప్తంగా 12 వేల ఎకరాలకుపైగా వరి, 6 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు నీటమునిగిపోయాయి. కొన్ని రోజులుగా ముంపులో చిక్కుకున్న చేలల్లో నీరు బయటకు వెళ్లకపోవడంతో భారీగా వరి పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. అటు వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వరి చేలల్లోకి ఇసుక కొట్టుకువస్తుండడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

- భారీ వర్షాలకు సుద్దగడ్డ మహోగ్రరూపం
- సోమవారం ఒక్కసారిగా భారీగా పెరిగిపోయిన వరద
- గొల్లప్రోలు, ప్రత్తిపాడుల్లో నీటమునిగిన వరి, వాణిజ్య పంటలు
- వాగు పొంగడంతో 216 ఎన్‌హెచ్‌పైకి వచ్చేసిన నీళ్లు
- గొల్లప్రోలులో కాలనీలు మునక.. బోట్లలో రాకపోకలు
- భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా 12వేల ఎకరాల్లో వరి మునక
- కొన్ని రోజులుగా చేలన్నీ ముంపులోనే.. కుళ్లిపోతున్న పంటలు
- సుద్దగడ్డ పాపం గత వైసీసీ సర్కారుదే.. అయిదేళ్లూ టెండర్లు మూలకు
- మరోపక్క వరద సహాయ పనుల కోసం జిల్లా నుంచి విజయవాడకు పది బోట్లు తరలింపు



గొల్లప్రోలులో వరద కారణంగా పడవల్లో రాకపోకలు సాగిస్తున్న జగనన్న కాలనీవాసులు

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/గొల్లప్రోలు, సెప్టెంబరు 2: వాయుగుండం ప్రభావంతో నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో సుద్దగడ్డ వాగుకు వరద పోటెత్తుతోంది. వాగుకు ఎగువ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చి చేరుతున్న వరద నీటితో ఉధృతి సోమవారం ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో శివారునున్న గొల్లప్రోలు మండలం తీవ్రంగా ప్రభావితమైంది. మండలంలో అనేకచోట్ల సుద్దగడ్డ (కొండ)కాలువ గట్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. గతంలో ఎన్నడూ లేనంత వరద సుద్దగడ్డ కాలువ గట్లపై నుంచి పొంగిపొర్లుతుండడంతో గొల్లప్రోలు పట్టణ శివారు ప్రాంతం అంతా నీటమునిగిపోయింది. ఎటుచూసినా వరదనీరు పోటెత్తి నదిని తలపించింది. ముఖ్యంగా పేదల ఇళ్ల కాలనీకి వెళ్లే రహదారిపై వరద నీరు ఊహించనంత భారీగా వచ్చేసింది. సుమారు అర కిలోమీటరు మేర వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. కాజ్‌వే వద్ద ఆరు అడుగులకు పైగా ఎత్తులో వరద నీరుపారింది. ఒకరకంగా చెప్పాలంటే వరద నీటిలో పేదల ఇళ్ల కాలనీ వాసులు పూర్తిగా చిక్కుకుపోయిన పరిస్థితి నెలకొంది. ఏ అవసరానికి బయటకు వెళ్లాలన్నా ఎక్కడ వరదలో కొట్టుకుపోతారోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. అయితే ప్రభుత్వం దృష్టికి ఈ వ్యవహారం వెళ్లడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు వీలుగా అధికారులు బోట్లు ఏర్పాటుచేశారు. అటు నిత్యావసర సరుకులు కూడా అందించారు. కాలనీలో కొందరు తీవ్ర జ్వరాలతో బాధపడుతుండడంతో వారిని బోట్లలో సురక్షిత ప్రాంతానికి తీసుకువచ్చి అక్కడి నుంచి ఆసుపత్రికి తరలించారు. అలాగే పట్టణ శివారులోని సూరంపేట గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. సూరంపేటవాసులు తరచు రాకపోకలు సాగించే రైల్వే బ్రిడ్జి కింద భాగంలోకి భారీగా వరద నీరు వచ్చేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అటు ప్రత్యామ్నాయంగా ఉన్న ఊబంద బ్రిడ్జిపైనా వరద నీరు పెద్దఎత్తున ప్రవహిచడంతో జనం నరకయాతన పడ్డారు. అలాగే అక్కడ నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగుకు వరద ఉధృతి పెరగడంతో గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయం నుంచి కరణంగారి తోట మీదుగా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు(ఎన్‌హెచ్-216)కు వెళ్లే రహదారిపై వరద నీరు భారీగా ప్రవహించింది. అలాగే శివాలయమాన్యం కాలనీలోకి వరద నీరు చేరింది. అయితే హైవేపై వరదపోటు అధికంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు.

చేలన్నీ చెరువులై....

సుద్దగడ్డ వరద ఉధృతితో గొల్లప్రోలు పట్టణం, పరిసర ప్రాంతాల్లోని వేలాది ఎకరాలు పూర్తిగా నీటమునిగిపోయి నదిని తలపించాయి. గొల్లప్రోలు, తాటిపర్తి, సీతానగరం, లక్ష్మీపురం, చేబ్రోలు, చినజగ్గంపేట, వన్నెపూడి, కొడవలి తదితర గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల్లో వరి, పత్తి, అపరాలు, మొక్కజొన్న, మిర్చి, కూరగాయల పంటలు ముంపునకు గురయ్యాయి. వరద నీటి ఉధృతికి ఆయా పంటలు కొట్టుకుపోయాయి. సుద్దగడ్డతోపాటు చౌటు కాలువకు వరదలు రావడం, పుష్కర కాలువకు చినజగ్గంపేట, వన్నెపూడి గ్రామాల వద్ద గండ్లు పడటం, పోలవరం కాలువ నుంచి నీరు పొంగిపొర్లడంతో ముంపు ఊహించనంత అధికమైంది. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో పంటపొలాలు అయితే ఏకంగా సముద్రాన్ని తలపిస్తున్నాయి. అలాగే అధికవర్షాల కారణంగా పంటకాలువలు పొంగిపొర్లి పిఠాపురం బైపాస్‌రోడ్డు, జములపల్లి, నరసింగపురం సహా పలు గ్రామాల్లోని సుమారు 400 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. అలాగే కిర్లంపూడి, ప్రత్తిపాడు, గండేపల్లి, శంఖవరం, కాకినాడరూరల్, తుని, కోటనందూరుతోపాటు మొత్తం 20 మండలాల్లో భారీ వర్షాల కారణంగా వరి పంటలు పూర్తిగా నీటమునిగాయి. అనేక మండలాల్లో వరద నీటి ప్రవాహ ఉధృతికి పెద్దఎత్తున ఇసుక మేటల చేలల్లోకి కొట్టుకు వచ్చాయి. కాగా జిల్లా వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 12వేల ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇతర వాణిజ్య పంటలు ఆరు వేల ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయాయి. ఇదిలాఉంటే విజయవాడ నగరం కృష్ణా నది వరద, బుడమేరు పొంగిన కారణంగా జలవిలయంలో చిక్కుకుపోయింది. ఈ నేపథ్యంలో సహాయక చర్యల కోసం జిల్లా నుంచి పది వరకు ఫైబర్ బోట్లను అధికారులు పంపించారు. ఆదివారం అర్ధరాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ శాన్‌మోహన్‌తో మాట్లాడారు. విజయవాడ నగరంలో అనేక రహదారులు నదిని తలపిస్తుండడంతో చిక్కుకుపోయిన ప్రజలకు సహాయక చర్యల కోసం వెంటనే బోట్లను పంపాలని ఆదేశించారు. దీంతో సోమవారం తెల్లవారుజామునే కాకినాడ, చుట్టుపక్కల నుంచి లారీల్లో వీటిని తరలించారు.

సుద్దగడ్డ పాపం వైసీపీదే..

సుద్దగడ్డ వాగు పొంగి గొల్లప్రోలు మండలాన్ని తీవ్రంగా దెబ్బతీయడంతో ప్రజలు తీవ్రస్థాయిలో గత వైసీసీ సర్కారుపై మండిపడుతున్నారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరవగా, ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అర్ధాంతరంగా పనులను రద్దు చేసింది. వాస్తవానికి రూ.128 కోట్ల వ్యయంతో చేపట్టిన ఏలేరు మొదటి విడత ఆధునికీకరణ పనులు టీడీపీ హయాంలో 60 శాతం పూర్తికాగా, మిగిలిన పనులను వైసీపీ గాలికి వదిలేసింది. అలాగే ఏలేరు రెండోదశ కింద సుద్దగడ్డ ఆధునికీకరణకు రూ.145 కోట్లతో 2019 జనవరిలో అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో పనులు రద్దు చేసేసింది. జగన్ సర్కారు అధికారంలో ఉన్న అయిదేళ్లలో సుద్దగడ్డను పూర్తిగా గాలికి వదిలేసింది. చివరకు రెండేళ్ల కిందట గొల్లప్రోలులో నిర్వహించిన సభలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేస్తున్నట్టు జగన్ సీఎం హోదాలో ప్రకటించారు. అయితే టీడీపీ ప్రభుత్వంలో సిద్ధంచేసిన రూ.145 కోట్ల అంచనాలు గత వైసీపీ సర్కారు నిర్వాకం మూలంగా ఏకంగా రూ.750కోట్లకు పెరిగింది. అయినా ఫలితం సున్నా. అలాగే సుద్దగడ్డ వాగు వల్ల గొల్లప్రోలులోని పేదల ఇళ్ల కాలనీకి వెళ్లే రహదారి ముంపునకు గురవుతుండడంతో రూ.70 లక్షలతో బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించినా ఒక్క రూపాయి ఇవ్వలేదు.

తుని నియోజకవర్గంలోని వలసపాకల శివారు ముంపులో కొబ్బరి పంట



పంపా.. ముంచింది!

ఎగువన పంపా రిజర్వాయర్ గేట్లు తెరవడంతో పంపా జలాలు పంట పొలాల్లోకి ముంచెత్తుతున్నాయి. అన్నవరం వద్ద జాతీయ రహదారి మీదుగా గవరపేట, వలసపాకల, హంసవరం, జిల్లేడుపాడు గ్రామాల పంట పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి నెలకొంది. తుని మండలంలో 250 ఎకరాలకు పైబడి దెబ్బతినగా, పలుచోట్ల కూరగాయల, ఉద్యానవన పంటలు మునిగాయి. - తుని రూరల్





వరద సహాయ కార్యక్రమాల కోసం కాకినాడ నుంచి విజయవాడకు తరలివెళ్లిన బోట్లు.. గొల్లప్రోలులో చిన్నారిని తీసుకుని బోటులో వచ్చిన కాలనీవాసి

వరద బాధితుల సాయానికి ముందుకు రావాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 2: రాష్ట్రంలో వర్షాలు, వరదల వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా సహాయం చేయదలచిన వారు ఎవరైనా వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు కాకినాడ కలెక్టర్ కార్యాలయం జిల్లా రెవెన్యూ అధికారికి క్యాష్ రూపంలోగానీ, చెక్కు రూపంలోగానీ, వస్తురూపంలోగానీ అందజేయవచ్చని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. రాష్ట్రంలో విపరీతంగా కురిసిన వర్షాల ప్రభావంతో కృష్ణా నది, బుడమేరు, గోదావరి ఉపనదులకు వరదలు రావడం వల్ల విజయవాడ, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చాలామంది ప్రజలు ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. సాయంగా నగదు జమచేసే వారు బ్యాంకు ఖాతా నెంబరు 144010100020171, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కలెక్టరేట్ బ్రాంచ్‌లలో సంప్రదించాలని కోరారు.



సుద్దగడ్డ వరదల్లో ముంపునకు గురై దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, శాస్త్రవేత్త శర్మ తదితరులు

ముంపు తగ్గగానే నష్టం అంచనాలు వేస్తాం..

గొల్లప్రోలు, సెప్టెంబరు 2: అధిక వర్షాలు, వరదలతో వచ్చిన ముంపు తగ్గగానే పంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తామని, ఈమేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఏ.సీతారామశర్మతో కలిసి గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లో ముంపులో ఉన్న పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. జిల్లాలో ఐదు మండలాల్లో వరద ముంపు ఎక్కువగా ఉందన్నారు. గొల్లప్రోలు మండలంలో 450 హెక్టార్లలో వరి తదితర పంటలకు నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా గుర్తించామని, ఇది మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ ఉన్నారు.

ఆసుపత్రికి తాళాలు

- అందని వైద్య సేవలు
- రెండు నెలలుగా ఇంతే
- అయినా పట్టించుకోని అధికారులు



హోమియో ఆసుపత్రి ప్రధాన ద్వారానికి తాళం వేసిన దృశ్యం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని హోమియో ఆసుపత్రికి సుస్తీ చేసింది. గడిచిన రెండు నెలలుగా ఈ హోమియో ఆసుపత్రి సక్రమంగా పనిచేయడం లేదు. ఆసుపత్రి భవన ప్రధాన ద్వారం తలుపులు ఎప్పుడు చూసినా తాళం వేసి మూసే ఉంటున్నాయి. తెరుచుకోని ఈ ఆసుపత్రి వల్ల హోమియో మందుల కోసం వచ్చే వ్యాధిగ్రస్తులు ఆసుపత్రి మూతబడి ఉండడంతో వెనుదిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నెలలు తరబడి ఆసుపత్రి సేవలు అందక హోమియో రోగులు అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. మెట్ట ప్రాంతంలోని హోమియో వైద్యసేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంకోసం మూడు దశాబ్దాల కిందట మండలంలోని ధర్మవరంలో హోమియో ఆసుపత్రిని ఏర్పాటుచేశారు. అక్కడ కొంతకాలం పనిచేసిన ఈ ఆసుపత్రిని ప్రత్తిపాడులోని వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలోకి ఉన్నతాధికారులు తరలించారు. సాధారణ వైద్యంతోపాటు హోమియో వైద్యం కూడా ఒకే కాంపౌండులో ఉంటుందనే ఉద్దేశంతో అధికారులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన భవనంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటుచేశారు. కొన్నేళ్లపాటు ఈ ఆసుపత్రి సేవలు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలకు సేవలు అందించడంతోపాటు పరిసర నియోజకవర్గ గ్రామాలకు చెందిన ప్రజలు కూడా ఈ ఆసుపత్రి సేవలను వినియోగించుకునేవారు. ఈ ఆసుపత్రికి సొంత భవనం ఏర్పాటుచేయాలని, హోమియో వైద్యం అందించే ఆయుష్‌శాఖ నిధులు మంజూరుచేయడంతో కమ్యూనిటీహెల్త్ సెంటర్‌లోని సీమాంక్ వార్డుకు ఎదురుగా నూతనంగా హోమియో ఆసుపత్రిని నిర్మించారు. నూతన హోమియో ఆసుపత్రిలోకి మారకుండానే ఈ హోమియో వైద్యశాల సిబ్బంది కొరత కారణంగా మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లాలో కాకినాడ, దివిలి, ప్రత్తిపాడు, కోరంగి, పెరుమళ్ళపురం, అల్లిపూడిలలో హోమియో వైద్యశాలలు ఉండగా కాకినాడ, దివిలి వైద్యసేవలు మినహా మిగిలిన ఆసుపత్రులు వైద్యులు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయి. ఒక్కో ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ పనిచేయాల్సి ఉండగా మెడికల్ ఆఫీసర్లు 4 ఆసుపత్రుల్లో లేరు. ప్రత్తిపాడు ఆసుపత్రిలో కొన్నేళ్లుగా మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగానే ఉంది. ఏడాది కిందట దివిలి వైద్యాధికారిని ఇక్కడ వారానికి ఒకసారి వైద్య సేవలు అందించే విధంగా ఏర్పాట్లుచేశారు. తదనంతరం ఆ వైద్యాధికారిని దివిలికే పరిమితం చేయడంతో ఇక్కడ వైద్యాధికారి లేకుండాపోయారు. దీంతో ఈ ప్రాంతంలోని రోగులకు హోమియో వైద్యసేవలు అందుబాటులో లేకుండాపోయాయి. ప్రస్తుత వర్షకాలం సీజన్‌లో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో శరీరంలో ప్లేట్‌లెట్స్ పెంచే హోమియో వైద్యం స్థానికంగా లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హోమియో వైద్యాధికారుల పోస్టు భర్తీకి రాష్ట్రవ్యాప్తంగా చర్యలు తీసుకున్నప్పటికీ కొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ నియామకంపై కోర్టుకు వెళ్లడంతో ఆ పోస్టుల భర్తీలో జాప్యం నెలకొన్నట్టు సమాచారం. ఇక్కడ వైద్యాధికారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండో రోజూ కొన్ని రైళ్లు రద్దు

- 7లో

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.64 కోట్లు



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, సెప్టెంబరు 2: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,64,18,601 నగదు, 44 గ్రాముల బంగారం, 1880 గ్రాముల వెండి సమకూరాయి. 420 యుఎస్ఏ డాలర్లు, 490 యుఏఈ దిరహమ్స్, 140 ఇంగ్లాండ్ పౌండ్స్, మలేషియా డాలర్లు 100 లభించాయి. 34 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో పురోహితులు, నాయీబ్రాహ్మణులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీవల్లభుడికి లక్ష బిల్వార్చన



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో లక్ష బిల్వార్చన చేస్తున్న రుత్వికులు



పిఠాపురం, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభులకు లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో రెండో రోజైన సోమవారం అర్చకులు, రుత్వికులు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య బిల్వార్చన నిర్వహించారు. శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతిలను విశేషంగా అలంకరించారు. అనంతరం మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వ పుష్ప పూజ, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, వేద పారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక శక్తికి ఊతమిచ్చేలా
విద్యార్థి విజ్ఞాన మంథన్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 2: విద్యార్థి దశలోనే మేథస్సుకు పదును పెడితే జిజ్ఞాస పెంచి వారి ఉజ్వలమైన భవితకు బాటలు వేయవచ్చు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తికి ఊతమిచ్చేలా ప్రయోగాలు, పరిశోధనల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరిట జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణా పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞాన భారతి, ఎన్సీఈఆర్టీ, విజ్ఞాన ప్రసాద్ సంస్థలు సంయుక్తంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు ఎన్సీఈఆర్టీ, ఎన్సీఎస్ఎం, సీబీఎస్ఈ, స్టేట్ బోర్డు కలిపి ఈ పరీక్ష నిర్వహిస్తాయి. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి దేశంలోని ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌తో పాటు ఏడాది పాటు నెలకు రూ.2వేలు చొప్పున భాస్కర స్కాలర్‌షిప్ పొందే అవకాశం కలుగుతుంది. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.

వంద మార్కులకు పరీక్ష:

జూనియర్ విభాగంలో (6 నుంచి 8వ తరగతి), సీనియర్ విభాగంలో (9 నుంచి 11 వరకు) 100 ప్రశ్నలకు వంద మార్కులు వుంటాయి. పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయిలో అంతర్జాలం ద్వారా పరీక్షరాయవచ్చు. ఇంటి నుంచే ఆన్‌లైన్ విధానంలో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ద్వారా పాల్గొనవచ్చు. హిందీ, తెలుగు, ఆంగ్లంతో పాటు ఎనిమిది ప్రధాన ప్రాంతీయ భాషల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

ప్రత్యేక శిక్షణ: వీవీఎంలో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 6 నుంచి 11 తరగతులకు ప్రతి తరగతిలోనూ ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందికి ప్రతిభా పత్రాలను ఆన్‌లైన్‌లో అందజేస్తారు. జిల్లాస్థాయిలో కూడా ఇదే విధంగా అందజేస్తారు. 120 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి శిబిరానికి ఎంపిక చేసి.. దానిలో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని రాష్ట్ర స్థాయి విజేతలుగా ప్రకటించి వారికి రూ.5,000 (ప్రథమ), రూ.3,000 (ద్వితీయ), రూ.2,000 (తృతీయ) బహుమతులతో పాటు మెమెంటో, ధ్రువపత్రం ఇస్తారు. జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన 18 మంది విద్యార్థులను హిమాలయన్స్‌గా ప్రకటిస్తారు. వారికి రూ.25వేలు (ప్రథమ), రూ.15వేలు (ద్వితీయ), రూ.10వేలు (తృతీయ) బహుమతులతో పాటు మెమెంటో, ధ్రువపత్రం ఇస్తారు. అంతే కాకుండా వారికి డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బార్క్‌లలో 3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గత ఏడాది రాష్ట్ర స్థాయికి 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

- దరఖాస్తుకు గడువు : సెప్టెంబరు 15
- నమూనా పరీక్ష : అక్టోబరు 10
- ఫీజు: రూ.200
- రాష్ట్ర స్థాయి పరీక్ష : నవంబరు 26 లేదా డిసెంబరు 3, 10, 17 తేదీల్లో
- ప్రధాన పరీక్ష: అక్టోబరు 23 నుంచి 27
- సమయం : ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో (90 నిమిషాలు మాత్రమే. ప్రతి విద్యార్థి పరీక్షకు ఒకసారి మాత్రమే లాగిన్ అవ్వాలి)

» ఏటా జాతీయ స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్ష

» ప్రథమ విజేతకు రూ.25వేల నగదు బహుమతి

» ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

పిల్లి రమేష్, డీఈవో, కాకినాడ జిల్లా

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రతిభాన్వేషణా పరీక్షను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.



ప్రతిభ నిరూపణకు చక్కని వేదిక

కేసరి శ్రీనివాసరావు, కౌశల్ జిల్లా సమన్వయకర్త

విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ పరీక్ష చక్కని వేదిక. విద్యార్థి స్థాయి నుంచే శాస్త్రవేత్తలను తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నిర్వహిస్తున్న పరీక్షల్లో ఇది ఒకటి.

ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి

ఎన్.శ్రీనివాస్ వినీల్, కాకినాడ జిల్లా సైన్స్ అధికారి

ఈ పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. దీనివల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందుతాయి.





సాయిలక్ష్మీచంద్ర ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎంపీ హరీష్‌మాధుర్

ప్రాణాపాయ స్థితిలో ఉన్నా

» ఆస్తి అమ్మించి నా ఆరోగ్యాన్ని కాపాడండి

» ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సాయిలక్ష్మీ చంద్ర అర్జీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2: ప్రాణాపాయ స్థితిలో ఉన్నా... బంధువుల నుంచి కూడా ప్రాణ హాని ఉంది. తండ్రిద్వారా సంక్రమించిన ఆస్తిని అమ్మి ఆరోగ్యాన్ని కాపాడాలని రాజులపూడి సాయిలక్ష్మీచంద్ర వేడుకుంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఆమె తల్లి ఆరుద్రతో కలిసి వచ్చి అర్జీ అందించింది. 99శాతం దివ్యాంగురాలైన తనకు ప్రాణ రక్షణ కల్పించాలంది. తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని సొంతం చేసుకోవాలని కొందరు కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ప్రాణ రక్షణ కల్పించడంతో పాటు ఆస్తిని అమ్మి ఆరోగ్యాన్ని కాపాడాలని వేడుకుంది. ముందుగా ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను కలుసుకున్నారు. వైద్య సేవల కోసం తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎస్పీ కృష్ణారావుతో ఎంపీ ఫోనులో మాట్లాడి సాయిలక్ష్మి పరిస్థితిని వివరించారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీ భరోసా కల్పించారు.

డాక్టర్ సృజనకు
ఢిల్లీ ఎయిమ్స్‌లో పీజీ సీటు



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ వాకలపూడి సంతోష్‌నగర్‌కు చెందిన విశ్రాంత సైనికుడు సూర్యదేవర రామారావు కుమార్తె డాక్టర్ సృజన ప్రతిష్ఠాత్మకమైన ఢిల్లీ ఎయిమ్స్‌లో అనస్థీషియా విభాగంలో పీజీ సీటు సాధించింది. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ 2017 బ్యాచ్‌కు చెందిన సృజన వైద్య విద్యపై చేసిన పలు పరిశోధనలు, సైద్ధాంతిక వ్యాసాలకు 12 గోల్డ్ మెడల్స్ సాధించి బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా నిలిచింది. పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు దక్కించుకుంది. డాక్టర్ సృజనను ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు. సైనికుడిగా తండ్రి రామారావు దేశానికి సేవలు అందించారని, అయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని పేదలకు ఉచిత వైద్య సేవలందిస్తున్న సృజనకు నగర ప్రముఖులు పలువురు అభినందనలు తెలిపారు.

రెండో రోజూ కొన్ని రైళ్లు రద్దు

మరికొన్ని దారి మళ్లింపు

ప్రయాణికులకు తప్పని అవస్థలు

సామర్లకోట, సెప్టెంబరు 2: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో పలు రైల్వే ట్రాక్‌లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడ సెక్షన్‌లో రెండో రోజు అయిన సోమవారం పలు రైళ్లను రద్దు చేయగా మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. ప్రస్తుతం నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ రాకపోకలు సాగిస్తున్నాయి. రైళ్ల వేగాన్ని తగ్గించి నడపడంతో గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. సోమవారం ఉదయం 8.30 గంటలకు సామర్లకోట చేరుకోవాల్సిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మూడు గంటల ఆలస్యంగా వచ్చింది. ముంబై నుంచి భువనేశ్వర్ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ 12.30 గంటలకు రావాల్సి ఉండగా నాలుగున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆరు గంటలకు రావాల్సిన ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా ఆరు గంటలకు వచ్చింది. బొకారో ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. సామర్లకోట స్టేషన్ మొదటి ప్లాట్‌ఫామ్‌పై హెల్ప్ డెస్క్ కొనసాగించినట్టు సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు.

సోమవారం రద్దయిన రైళ్ల వివరాలు....

సికింద్రాబాద్-విశాఖ (22204), కడప-విశాఖ (17487), విశాఖపట్టణం-సికింద్రాబాద్ (12805), భువనేశ్వర్-బెంగళూరు (18463), తిరుపతి-కాకినాడ (17249), విశాఖపట్టణం-కడప (17488), విశాఖపట్టణం-తిరుపతి (08583), విశాఖపట్టణం-చెన్నై సెంట్రల్ (22869), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), గుంటూరు-విశాఖపట్టణం (22702), భువనేశ్వర్-ముంబయి (11020), విశాఖపట్టణం-గుంటూరు (22701)

మంగళవారం రద్దు చేసిన రైళ్ల వివరాలు

సికింద్రాబాద్-విశాఖ (20707), విశాఖ-సికింద్రాబాద్ (20708), విశాఖపట్టణం-సికింద్రాబాద్ (20833), సికింద్రాబాద్-విశాఖపట్టణం (20834), బెంగళూరు-హౌరా (12864), తిరుపతి-విశాఖపట్టణం (08584), తిరుపతి-పూరి (17480), మహబూబ్‌నగర్-విశాఖపట్టణం (12862), విశాఖపట్టణం-మహబూబ్‌నగర్ (12861), తిరుపతి-విశాఖపట్టణం (08584), సికింద్రాబాద్-షాలీమార్ (12774)

4వ తేదీన రద్దయిన రైలు

షాలీమార్-సికింద్రాబాద్ (12773)

దారి మళ్లించిన రైళ్లు

హైదరాబాద్-షాలీమార్ (18046), న్యూఢిల్లీ-విశాఖపట్టణం (20806), విశాఖపట్టణం-న్యూఢిల్లీ (22805), హైదరాబాద్-విశాఖపట్టణం (12728).... ఇవి పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా వెళ్తాయి.

వెల్ల నివేశనా స్థలాల కేసు కొట్టివేత

ద్రాక్షారామ, సెప్టెంబరు 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల లాకుల వద్ద నివేశనా స్థలాల కేసును రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం కొట్టివేసింది. వెల్ల లాకుల వద్ద నివాసముంటున్న 22 మంది పట్టాదారులను ఖాళీ చేయించేందుకు 2012 మార్చి 20న రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు చర్యలు చేపట్టాయి. స్థలాలు ఖాళీ చేయించడాన్ని లబ్ధిదారులు, రైతుకూలీ సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. రైతు కూలీ సంఘం నాయకులు ఉంద్రు గనిరాజు, బత్తుల సిద్దూలతో పాటు 19 మందిపై కేసులు నమోదు చేశారు. 12ఏళ్ల పాటు విచారణ జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుల్లో కేసు కొట్టి వేసినట్టు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ తెలిపారు. దీనిపై ఆయనతో పాటు రైతు కూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమశంకరం హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదులు నీలం మధుసూదనరావు, సూరంపూడి సత్యనారాయణ, పచ్చిమళ్ల సంపతరావు, నీలం స్నేహలతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పట్టాదారులు 22 మందికి న్యాయం చేయాలని మంత్రి సుభాష్‌కు రైతు కూలీ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ ఆదినారాయణ

20 కిలోల గంజాయి స్వాధీనం

ఆరుగురిని అరెస్టు చేసిన రాజమహేంద్రవరం వన్ టౌన్ పోలీసులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అటు గంజాయి అమ్ముతూ... ఇటు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తూ విలాస జీవితానికి అలవాటుపడిన ఆరుగురిని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జాంపేటలోని ముగ్గుపేట చర్చి సెంటర్ సమీపంలో సమాధుల వద్ద నిల్వ ఉంచిన 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. సీటీఆర్ఐ సుబ్బారావునగర్‌కి చెందిన తేలంశెట్టి సాయి భార్గవ్, తాడితోట అంబేడ్కర్ నగర్‌కి చెందిన నేతల వివేక్ (మార్లిస్), బత్తిన రవితేజ, దాసరి చందు, రెల్లిపేటకు చెందిన రాయి సింహాద్రి అప్పన్న, వీరభద్ర నగర్‌కి చెందిన సోరా దుర్గను అదుపులోకి తీసుకున్నామని సీఐ ఎన్.మురళీకృష్ణ పేర్కొన్నారు. భార్గవ్, మార్లిస్ నుంచి వివిధ కేసులకు సంబంధించి కారు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ ఆదినారాయణలను ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ రమేశ్‌బాబు అభినందించారు.

శృంగవరంలో డయేరియా విజృంభణ

» రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 21 మంది

రౌతులపూడి, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం శృంగవరం గ్రామంలో డయేరియా విజృంభించింది. అధ్వాన పారిశుధ్యంతో గ్రామస్తులు డయేరియా బారిన పడ్డారు. అల్లు పాదలియ్య, గొనగాలి పెంటమ్మ, ఈగల వీరబాబు, కోన రమణ, జి.సత్యవతి, లొండా గోవిందమ్మ, అల్లు గంగరాజు, జి.లోవసత్తిబాబు, అల్లు రమణ, గదులు రమణ సహా 21మంది రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్, సహాయ వైద్యాధికారి పి.సరిత గ్రామంలో పర్యటించారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలను తెలుసుకున్నారు. బావిని పరిశీలించారు. రక్షిత నీరు అందించే పైపుల్లో మురికి నీరు చేరి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చికిత్స అందిస్తున్నారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలపై పూర్తిగా విచారించి వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు.



డయేరియా బాధితులను పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్

గుండాల డంప్ నుంచి తెలంగాణకు ఇసుక రవాణా

టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న భద్రాచలం పోలీసులు



ఎటపాక, సెప్టెంబరు 2: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల ఇసుక డంప్-1 నుంచి ఇసుక అక్రమ మార్గంలో తెలంగాణకు తరలిపోతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం గుండాల డంప్ నుంచి టిప్పర్‌లో ఇసుక లోడ్ చేసుకుని భద్రాచలం రవాణా చేస్తున్న క్రమంలో భద్రాచలం పట్టణ పోలీసులు టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇటీవల గుండాల ఇసుక డంప్-1 వద్ద కొందరు వ్యాపారస్తులు బినామీ లబ్ధిదారుల ఆధార్ నెంబర్లతో గ్రామ సచివాలయంలో బుక్ చేసుకుని, లోడింగ్ పాయింట్ వద్ద ఇసుక లోడ్ చేసుకుని యథేచ్ఛగా తెలంగాణ ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వున్నాయి. పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ, నిఘా కొరవడడంతోనే ఇసుక తెలంగాణకు తరలిపోతున్నట్టు తెలుస్తోంది. రాత్రివేళల్లో కూడా ఈ డంప్ నుంచి ఇసుక దొంగ తనంగా తరలిపోతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణాలోపంతోనే ఇసుకను కొందరు వ్యాపారస్తులు దొంగతనంగా పట్టుకెళ్తున్నారన్నారు. పురుషోత్తపట్నం చెక్‌పోస్టు వద్ద పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి తెలంగాణకు అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు కోరారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

ఎంత కష్టమొచ్చిందో!

వర రామచంద్రాపురం, సెప్టెంబరు 2: వీఆర్ పురం సంత వద్ద గుర్తు తెలియని వ్యక్తులు లేగ దూడను కిరాతకంగా నరకడంతో పేగులు బయటకు వచ్చాయి. ఆ దూడను చూసిన వారు పశు వైద్యులకు సమాచారం ఇచ్చారు. రేఖపల్లి పశు వైద్యురాలు డాక్టర్ రాజేశ్వరి, సిబ్బంది శ్రీకాంత్, కృష్ణార్జునరావు మూడు గంటలు కష్టపడి ఆ దూడకు శస్త్ర చికిత్స చేశారు.



వెంటాడిన మృత్యువు

అంబులెన్స్‌ను ఢీకొట్టిన కారు... ఎగిరిపడి రోగి మృతి

కాకినాడ రూరల్, సెప్టెంబరు 2: తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్‌ను కారు ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన పెద్దిరెడ్డి రాధాకృష్ణ (45) కొనేళ్లు ఉద్యోగం చేసి రెండేళ్ల క్రితం కాకినాడ వచ్చి స్థానికంగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడికి భార్య లక్ష్మి, ఇంటర్ చదువుతున్న హర్షిత అనే కుమార్తె ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున రాధాకృష్ణ తీవ్రమైన అనారోగ్యంతో ఇబ్బందిపడుతుండటంతో ట్రస్ట్ ఆసుపత్రికి ఫోన్ చేయగా వారి అంబులెన్స్ వచ్చింది. దాంట్లో తరలిస్తుండగా సర్పవరం కూడలి వద్దకు వచ్చేసరికి కారు వెనుక నుంచి అంబులెన్స్‌ను ఢీకొట్టడంతో దాని టైరు పేలి రోగి రాధాకృష్ణ ఎగిరి కిందపడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని, ట్రస్టు ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సర్పవరం సీఐ పెద్దిరాజు తెలిపారు.

డెంగీతో వ్యక్తి మృతి



మృతి చెందిన రమణ (పాత చిత్రం)

రాజవొమ్మంగి, సెప్టెంబరు 2: అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం లబ్బర్తి గ్రామానికి చెందిన పొడుగు రమణ (40) సోమవారం ఉదయం డెంగీతో మృతి చెందాడు. దీనిపై లాగరాయి వైద్యాధికారిణి ఉషశ్రీని వివరణ కోరగా.. రమణ టైఫాయిడ్, కామెర్లతో కొన్ని రోజులుగా వైద్యం పొందుతూ శనివారం లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడన్నారు. మలేరియా, డెంగీ ర్యాపిడ్ టెస్టు (ప్రాథమిక) చేయగా మలేరియా నెగిటివ్, డెంగీ పాజిటివ్ వచ్చిందన్నారు. పూర్తిస్థాయిలో డెంగీ టెస్టు చేయించుకుని వైద్యం పొందేందుకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని చెప్పారు. రమణను వైద్యాధికారులు ఏ ఆసుపత్రికీ రిఫర్ చేయలేదని, సకాలంలో సరైన వైద్యం అందకే మృతి చెందాడని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో యాదగిరేశ్వరరావు విలేకరు లతో మాట్లాడుతూ మండలంలో సోమవారం డెంగీ కేసులు ఏమీ నమోదైనట్టు వైద్యులు రిపోర్టులు ఇవ్వలేదన్నారు. రమణ మృతిపై మాత్రం సంబంధిత వైద్యాధికారి ఉషశ్రీ డెంగీ వీక్ పాజిటివ్ వచ్చిందని చెప్పారన్నారు.

రైలు రద్దుతో... వ్యాన్‌లో వెళ్తుండగా

కేసముద్రం వద్ద వాగులో కొట్టుకుపోయిన రామవరం, కుతుకులూరు వాసులు

ఒకరిని కాపాడిన రెస్క్యూ టీమ్... మరొకరి ఆచూకీ కోసం గాలింపు



గల్లంతైన నాగభూషణం (పాత చిత్రం)

అనపర్తి, సెప్టెంబరు 2: వ్యాపారం నిమిత్తం తెలంగాణ వెళ్లిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం, కుతుకులూరు గ్రామాలకు చెందిన ఇద్దరు వాగులో గల్లంతయ్యారు. వీరిలో ఒకరిని రెస్క్యూ టీమ్ కాపాడగా మరొకరి ఆచూకీ లభించలేదు. రామవరం గ్రామానికి చెందిన టీకే సునీల్, కుతుకులూరుకు చెందిన నక్కిన నాగభూషణం రామగుండం నుంచి హైదరాబాద్ వెళ్లే సంఘమిత్ర ట్రైన్ ఎక్కారు. అది మధ్యలోనే నిలిచిపోవడంతో కేసముద్రం నుంచి మహబూబాబాద్ వెళ్లేందుకు డీసీఎం వ్యాన్ ఎక్కారు. అది కేసముద్రం వద్ద వాగులో కొట్టుకుపోయింది. సునీల్‌ను రెస్క్యూ టీమ్ కాపాడి ఒడ్డుకు చేర్చారు. గల్లంతైన నాగభూషణం కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సునీల్‌కు ఫోను చేసి పరామర్శించారు. భూషణం ఆచూకీ కోసం ప్రయత్నం చేయాలని అక్కడి అధికారులను ఫోనులో కోరారు.



వీరంగం చేసిన ఎద్దును అదుపు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఎద్దు వీరంగం: ఇద్దరికి గాయాలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 2: ఓ ఎద్దు వీరంగం చేయడంతో హోంగార్డుతో పాటు ఒక మహిళ గాయాలపాలైంది. స్థానిక భానుగుడి కూడలి వద్ద విధుల్లో ఉన్న హోంగార్డు మహేష్‌ను కుడి కాలు తొడపై పొడవడంతో బలమైన గాయమైంది. మరో మహిళను కూడా గాయపర్చింది. వారిద్దరినీ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆ ఎద్దు వార్ఫ్ రోడ్డు మీదుగా జగన్నాథపురం బ్రిడ్జి వద్ద తుప్పల్లోకి వెళ్లగా ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని వెటర్నరీ వైద్యులకు అప్పగించారు. అనంతరం ఆ ఎద్దును సంరక్షణ నిమిత్తం జంతు హింస నివారణా సంఘం (ఎస్‌పీసీఏ)కి అప్పగించినట్టు ట్రాఫిక్ సీఐ రమేష్ చెప్పారు.

తేటగుంట పీహెచ్‌సీని పరిశీలించిన డీఎంహెచ్‌వో

తుని రూరల్, సెప్టెంబరు 2: మండలంలో తేటగుంట పబ్లిక్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో నరసింహనాయక్ సోమవారం పరిశీలించారు. ఆసు పత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశమై నేషనల్ హెల్త్ స్కీమ్స్ అమలుపై సమీక్షించారు. రికార్డులు పరిశీలన అనంతరం పలు సూచనలి చ్చారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత ఉన్నారు.

జగ్గంపేటలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న తుమ్మలపల్లి

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా పాత పోలీస్‌స్టేషన్ వద్ద డొక్కా సీతమ్మ అన్నదాన క్యాంటీన్‌ను జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సోమవారం ప్రారంభించారు. తుమ్మలపల్లి మాట్లాడుతూ మా అధినేత స్ఫూర్తితో జగ్గంపేటలో డొక్కా సీతమ్మ అన్నదాన క్యాంటీన్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రతి సోమవారం డొక్కా సీతమ్మ పేరుపై ఈ క్యాంటీన్ నిర్వహిస్తామని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం నుంచి శాశ్వతంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ జగ్గంపేటలో ఏర్పాటు చేసేం దుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సూరంపాలెం బాలు, మేడిబోయిన శ్రీనివాస్, ఉలిసి అయ్యిరాజు, మేడిపోయిన వీరబాబు పాల్గొన్నారు. మన్యవారిపాలెం, నరేంద్ర పట్నం, రాజపూడి గ్రామాలలో జనసేన పార్టీ జెండా దిమ్మలను తుమ్మలపల్లి ప్రారం భించారు. నరేంద్రపట్నంలో కాకినాడ అక్షయ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీన్ని తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించారు.

గండేపల్లి: మల్లేపల్లి పంచాయతీ ఆవరణలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలకు తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉప్పలపా డులో వేడుకలు జరిగాయి. సర్పంచ్ బలిరెడ్డి గంగరాజు, బత్తుల రమణ, బలిరెడ్డి గణేష్, రామకుర్తి నరసింహం, అడబాల ఆంజనేయులు, నాగేంద్ర, పితాని వీరబాబు, వెలిది చిన్నోడు, తెలగరెడ్డి భద్రరావు, కంచర్ల సుబ్రహ్మణ్యం, బత్తుల కాపు, బాలు, శివ పాల్గొన్నారు. ముర్రారిలో జనసైనికుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఉపసర్పంచ్, టీడీపీ యువనాయకుడు జాస్తి వసంత్ హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

'ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి'

కాకినాడ రూరల్, సెప్టెంబరు 2: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా ఓటర్ల నమోదు కోసం అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాప కులు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఓటర్ల నమోదు సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో మొదటి మెట్టు అయిన ఓటర్ల నమోదును ఉద్యమ స్ఫూర్తితో ముందుకు నడిపించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కాశీ విశ్వనాథ్, శివప్రసాద్, శ్రీను, సత్యనారాయణ, అశ్విని, పార్వతి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు సత్వరం పూర్తిచేయాలి : పీడీ

కరప, సెప్టెంబరు 2: లబ్ధిదారులను అప్రమత్తం చేసి ఆయా దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను సత్వరం పూర్తిచేయించాలని గృహనిర్మాణశాఖ పీడీ ఎన్‌వీవీ.సత్యనారా యణ సూచించారు. కరప మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆ యా శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. సెప్టెంబరు 24వ కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తవుతుందని, ఈ లోగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. 2014-19లో ఎన్‌టీఆర్ హౌసింగ్ స్కీ మ్ కింద ఇళ్లు కట్టుకుని బిల్లులు పడనివారి జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయా లన్నారు. హౌసింగ్ ఈఈ వైశ్రీనివాస్, డీఈఈ కె.సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రమణకుమార్, ఐకేపీ సీసీ మురళీకృష్ణ ఉన్నారు.

సమన్వయంతో చవితి ఉత్సవాలు : ఆర్డీవో

పెద్దాపురం, సెప్టెంబరు 2: అధికారులంతా సమన్వయంతో పనిచేసి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికా రులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7న చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలను ఏ అపశృతులు జరగకుండా జరిగేలా చూడాలన్నారు. గణేష్ ఆలయాలు, బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై విగ్రహాలను ప్రతిష్ఠించడం కోసం రెవెన్యూ, పోలీస్, స్థానిక సంస్థ లు, విద్యుత్, అగ్నిమాపక శాఖలనుంచి అనుమతి పొందాలన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో కేవీ మాధవరావు, తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, సీఐ టి.క్రాంతికుమార్, ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు.

'సమాజంలో నైతిక విలువలు చాటాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 2: 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' ప్రచార ఉద్యమంలో అందరూ పాల్గొనాలని, తద్వారా సమాజంలో నైతిక విలువలు చాటాలని జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు సిద్ధీఖా, జిల్లా బాధ్యురాలు షహనాజ్ పిలుపునిచ్చారు. స్థానిక సత్యప్రసన్ననగర్‌లోని అల్ ఫలాహ్ మసీదులో ప్రచార ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మహిళా విభాగం ప్రతినిధు లు మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 1న ప్రారంభించిన ప్రచార ఉద్యమాన్ని 30 వరకు కొనసాగించనున్నామన్నారు. భయంకర సామాజిక నేరాలు అరికట్టాలంటే అందరూ నైతిక విలువల వైపునకు మళ్లాలన్నారు. సంస్థ సభ్యురాళ్లు గుల్జార్, నజ్మా, నయీమా, కార్యకర్తలు జుబేదా, ఖమ్రున్నీసా, రుక్సానా, ఆషా, ఆయేషా, గౌసియా పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 2: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని కాకినాడ ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు నిన దించారు. సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది శ్రీహరి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఆర్టికల్ 341కి వ్యతిరేకమని, తీర్పును సుప్రీం పునఃసమీక్షించాలని డిమాం డ్ చేశారు. ర్యాలీలో న్యాయవాదులు వెంకటరమణ, పృథ్వీరాజు, నగధర్, రాజబాబు, అశోక్‌కుమార్, సత్యం మాష్టార్, శ్రీనుబాబు, మూలయ్య, స్వామి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 2: మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడవ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహరావు తీర్పు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీ సులు డ్రంక్ అండ్ డ్రైవ్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కాకి నాడ ట్రాఫిక్ 1, ట్రాఫిక్ 2 పీఎస్‌ల ఆధ్వర్యంలో ఆదివారం మొత్తం 19 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చారు. వారిలో జరిమానా చెల్లించలేని నలుగురికి 2రోజులు చొప్పున జైలు శిక్ష, మిగిలిన 15 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపిక



విజయ కుమారి

తాళ్లరేవు, సెప్టెంబరు 2: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సంద ర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు గాడిమొగ పంచా యతీ పెదవలసల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.విజ యకుమారిని ఎంపిక చేసినట్లు ఎంఈవోలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ సోమవారం తెలిపారు. మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యా యులుగా ముగ్గు రు ఉపాధ్యాయులను ఎంపిక చేశామన్నారు. ఈనెల 5న ప్ర ముఖుల నుంచి అవార్డులు అందుకోనున్నట్టు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2: మండలం ధర్మవరం శివారు జాతీయ రహదారిపై జరి గిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ధ ర్మవరం శివారు భ్రమరాంబిక టిఫెన్ సెంటర్ ఎదురుగా రోడ్డుపై వెళ్తున్న గుర్తు తెలి యని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం గత నెల 31న ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. వ్యక్తి వివరాలు తెలియరాలేదని, సుమారు 45-50 మధ్య వయస్సు ఉంటుందని, చారల చొక్కా ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ కె. వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసినవారు ప్రత్తి పాడు సీఐ 9440796530, ఎస్ఐ 9440796570 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

అనుమానాస్పదస్థితిలో మరొకరు..

సామర్లకోట, సెప్టెంబరు 2: సామర్లకోట పట్టణ శివారు దుర్గాప్రసాద్ పాఠశాల సమీపాన నేదూరి చల్లారావు(40) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని సోమవారం స్థానికులు గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతుడు స్థానిక అమ్మానమ్మ నాయుడు నగర్ కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు

వ్యక్తికి గాయాలు

పిఠాపురం, సెప్టెంబరు 2: పిఠాపురం బైపాస్ రోడ్డులో మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొంది. విశాఖపట్టణం నుంచి డాక్టర్ సందీప్ కాకినాడకు కారులో బయల్దేరాడు. పిఠా పురం బైపాస్ రోడ్డు విరవాడ కూడలిలో సిమెంటు షాపునకు వెళ్లేందుకు మోటార్ సైకిల్‌పై వస్తున్న పిఠాపురం పట్టణ శివారు ఏడుకాలువలు ప్రాంతానికి చెందిన కాకి బాలకృష్ణను కారు ఢీకొంది. ప్రమాదంలో అతడికి గాయాలయ్యాయి. కారు, మోటార్ సైకిల్ దెబ్బతిన్నాయి. బాలకృష్ణను హైవేమొబైల్ పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు





కాకినాడ సిటీ: రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అంజేస్తున్న మంత్రి సుభాష్, కార్పొరేషన్: మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీ

పలుచోట్ల రక్తదాన, వైద్య శిబిరాలు
మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు

పిఠాపురం, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను సోమ వారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పిఠాపురం వెంకటేశ్వర థియేటర్ ఆవరణలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 100మంది రక్తదానం చేశారు. కుమారపురంలో రక్తదాన శిబిరం జరిగింది. గోకులం గ్రాండ్‌లో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో పలు వురు వైద్య నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు స్కానింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్ సహా పలు ఖరీద యిన పరీక్షలకు డాక్టర్ బుర్రా దివ్యరాజ్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పిఠాపురం నియోజకవర్గ జనసే న ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణా కమిటీ ప్రధాన కార్యదర్శి చోడిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. పలు చోట్ల మొక్కలు నాటారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజక వర్గవ్యాప్తంగా 20వేల మొక్కలు నాటుతున్నట్టు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాని తెలిపారు. కాగా రక్తదాన, వైద్య శిబిరాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ పాల్గొన్నారు. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టిన నిర్వాహకులను అభినం దించారు. శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో పవన్‌క ల్యాణ్ పేరున ఎమ్మెల్సీ హరిప్రసాద్ ప్రత్యేక పూజలు చేయించారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిఠాపురం టీడీపీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం కుమారపురంలో జరిగిన రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు నాటారు.

సామర్లకోట: పట్టణంలోని జయలక్ష్మి థియేటర్ ఆవరణలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హాజరయ్యారు. అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను రాజప్ప కట్ చేసి తుమ్మల బాబుకు, బీజేపీ ఇంచార్జి వెంకటరమణ కు అందించారు. మిఠాయిలు పంచారు. భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. థియేటర్ మేనేజరు వర్రే సతీ ష్, కూటమి నాయకులు, పవన్ అభిమానులు పాల్గొ న్నారు. మండలంలోని హుస్సేన్‌పురంలో తుమ్మల బా బు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హాజరై ప్రారంభించారు. 120మంది యువత రక్తదానం చేసారు. కార్యకర్తలు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను రాజ ప్ప, తుమ్మల కట్ చేశారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఇంచార్జి వెంకటరమణ, గుమ్మళ్ళ రామకృష్ణ, చల్లా బుజ్జి, కోట అప్పారావు, తలారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వెంకట కృష్ణరాయపురంలో పవన్ అభిమానులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే రాజప్ప తనయుడు నిమ్మ కాయల రంగనాగ్, తుమ్మల బాబు, టీడీపీ నాయకులు కుర్రా నారాయణస్వామి, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని కట్ట మూ రు, జి.రాగంపేట, గోరింట తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి ర్యాలీలు నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచారు. రాజాసూరిబాబురాజు, విత్తనాల వెంకట రమణ, మేడిద శ్రీనివాస్, గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: స్థానిక 36వ డివిజన్ జనసేన ఇన్ చార్జి సుంకర సురేష్ ఆధ్వర్యంలో దేవాలయం వీధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనసేన నగర అధ్య క్షుడు తోట సుధీర్ పాల్గొని కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీని వాస్, మహిళా నాయకురాళ్లు మిరియాల హైమావతి, నల్లూరి తులసి, కూటమి నాయకులు పాల్గొన్నారు. పెదపూడి మండలం పెద్దాడలోని శ్రీ సీతారామ భాస్క రరామారావు కళ్యాణ మండపంలో పెద్దాడ జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించి మొక్కలు నాటారు. రక్తదాన దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. సంపరలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. కాజులూరు మండలంలో పలు గ్రామాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజర య్యా రు. మంజేరు, గొల్లపాలెం, ఆర్యవటం గ్రామాల్లో వృద్ధు లకు పండ్లు పంపిణీ చేశారు. మొక్కలను నాటారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, స్థానిక నాయకులు ఉన్నారు.

కార్పొరేషన్(కాకినాడ): శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వ ర్యంలో నగరంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీని వాస్, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, సత్తిబాబు, శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత ఫౌండర్ చైర్మన్ గుంటూరి శ్యామ్, డైరెక్టర్ శైలజాశ్యామ్, మాజీ కార్పొరేటర్ ప్రకాష్ ఉషారాణి, రోటరీ క్లబ్ సభ్యులు వర్మ, ప్రసాద్ మొక్కలు పంపిణీ చేశారు. కొండయ్య పాలెం శారదమ్మగుడి సమీపంలో ముత్తా వారి ఫ్లైఓవ ర్ వద్ద జనసేన నేతలు నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.

కాకినాడ రూరల్: డిప్యూటీ సీఎం కె.పవన్ పుట్టిన రోజు సందర్భంగా కాకినాడ బీచ్‌లో క్లీన్ ఆంధ్రా గ్రీన్ ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పంతం నానాజీ ప్లాస్టిక్ వ్యర్థాలను తీసివేసారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు కటకంశెట్టి వెంకట ప్రభాకర్, పెంకే శ్రీనివాస బాబా, నురుకుర్తి వెంకటేశ్వరరావు, శిరంగు శ్రీనివాస రావు, గట్టి సత్యనారాయణ, తాతాజీ తదితరులున్నారు.

గొల్లప్రోలు: జనసైనికుల ఆధ్వర్యంలో గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల, మండలపరిషత్ నెంబరు 1 ప్రాథమిక పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 45మంది రక్తదానం చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 251మందికి కంటి పరీక్షలు చేసి, 49మందికి ఆపరేషన్లు అవసర మని, 50మంది కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేసి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామని జనసైనికులు తెలిపారు.

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తి, చేబ్రోలు, దుర్గాడ, వన్నెపూడి, కొడవలి, చెందుర్తి, ఏకే మల్లవరం, చినజగ ్గంపేట తదితర గ్రామాల్లో పలుచోట్ల మొక్కలు నాటారు. జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌతులపూడి: బలరామపురం, రౌతులపూడిలో పాఠశాల చైర్మన్లు యగదాసు హరిబాబు, షేక్ సలీం పాఠశాల ఆవరణల నందు మొక్కలు నాటారు.

ప్రత్తిపాడు: ఉత్తరకంచిలో పవన్ అభిమానులు కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. ధర్మవరంలో జనసేన జిల్లాసంయుక్త కార్యదర్శి దానం శేషారావు ఆధ్వర్యంలో పవన్ అభిమానులు, జనసేన కార్యకర్తలు కేట్ కట్‌చేసి స్థానికులకు పంపిణీ చేశారు. అలాగే ఒమ్మంగి గ్రామంలో జనసేన కార్యకర్తలు మొక్కలు నాటారు.



పిఠాపురంలో రక్తదాన శిబిరం

శంఖవరం: జనసేన ఆధ్వర్యంలో కత్తిపూడిలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని మొక్కలు నాటారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, టీడీపీ నేతలు పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు, బద్ది రామారావు, ఉల్లి వీరభ ద్రరావు, తెలుగుయువత అధ్యక్షుడు కీర్తి వెంకటసు భాష్, కరణం సు బ్రహ్మణ్యం, గాబు సుభాష్, కొయ్యా రమణ, గాబు శివ, రాజాల చిట్టిబాబు పాల్గొన్నారు.

జగ్గంపేట: ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో జనసేన జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ ఏర్పాటు చేసిన భోజనాల ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేదలకు వడ్డించారు.

తాళ్లరేవు: తాళ్లరేవులో జనసేన నేత మత్తుర్తి మణి కంఠ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కేక్‌ను కట్ చేసి హైస్కూల్లో మొక్కలు నాటారు. పి.మల్లవరం జనసైనికుడు వేగి రుద్రనాగ భైరవప్రసాద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలను ఎమ్మెల్యే దాట్ల అభినందించారు. తాళ్లరేవు ఆసుపత్రిలో రోగులకు కూటమినేతలు పండ్లు పంచారు. జనసైనికులు అత్తిలి బాబూరావు, బండారు దొరబాబు, ముత్యాల జయలక్ష్మీ, సూరంపూడి కుమార్, పోతుల రాంబాబు, చిక్కం శ్రీరామచంద్రుడు, టీడీపీనేతలు టేకుమూడి లక్ష్మణరా వు, నడింపల్లి వినోద్, గంజా సూరిబాబు, పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లిలో రావు అక్షయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని మొక్కలు నాటారు. డాక్టర్ విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఉప్పా డలో రోడ్లపై ఉన్న గుంతలను జనసైనికులు పూడ్చా రు. కొత్తపల్లిలో జనసైనికులు రక్తదానం చేశారు.

ఏలేశ్వరం: లింగంపర్తిలో జనసేన ప్రత్తిపాడు ఇన్ చార్జి వరుపుల తమ్మయ్యబాబు నేతృత్వంలో మొక్కలు నాటడం, రక్తదాన శిబిరం, నేత్రవైద్య శిబిరం చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరై మొక్కలు నాటారు. సి.రాయవరం గ్రామంలో జనసేన నేత పలివెల వెంకటేష్ మొక్కలు పంపిణీ చేపట్టారు.

కరప: జనసేన సీనియర్ నేత రెడ్డిపల్లి భాస్కర్ కరప బీసీ బాలుర గురుకుల పాఠశాలలో భారీ కేక్ కట్ చేశారు. 350 మంది విద్యార్థులకు మాంసాహార భోజనాన్ని అందించారు. మొక్కలు నాటి నీళ్లుపోశారు. గొర్రిపూడి జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో జనసేన నేత పంతం సందీప్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. పవన్ పుట్టినరోజు వేడుకల్లో సందీప్ కేక్ కట్ చేశారు.



కరపలో ఆహారం వడ్డిస్తున్న జనసేన నేత రెడ్డిపల్లి



గొల్లప్రోలులో కాయగూరలు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎమ్మెల్సీ, తమ్మయ్యనాయుడు

సేవా కార్యక్రమాల్లో జనసైనికులు ముందు : ఎమ్మెల్సీ హరిప్రసాద్

గొల్లప్రోలు, సెప్టెంబరు 2: ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంతో పాటు సేవా కార్యక్రమాల నిర్వహ ణలో జనసైనికులు ఎల్లప్పుడు ముందుంటారని ఎమ్మెల్సీ హరిప్రసాద్ తెలిపారు. సుద్దగడ్డ వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయి 3 రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న గొల్లప్రోలులోని జగనన్న కాలనీ వాసులకు అందించేందుకు మాధురి విద్యాసంస్థల అధినేత, జన సేన నాయకుడు కదారి తమ్మయ్యనాయుడు కాయగూ రలు, కిరాణా సరుకులు, నిత్యావసర వస్తువులు, పాలు ప్యాకెట్లు సమకూర్చారు. సోమవారం వాటిని ఎమ్మెల్సీ నాయుడు కాలనీవాసులకు అందజేశారు. జనసైనికులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. తమ్మయ్యనాయుడుని ఎమ్మెల్సీ అభినందించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా....



విజయవాడ వరద బాధితులకు పంపుతున్న కాయగూరల వ్యాన్ ప్రారంభిస్తున్న వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 2: వరద బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలి పారు. విజయవాడ వరద బాధితుల కోసం వర్మ రూ.2లక్షలకు పైగా వెచ్చించి 5 టన్నులకు పైగా కాయ గూరలను సమకూర్చారు. కాయగూరలతో కూడిన వ్యా న్‌ను పిఠాపురం టీడీపీ కార్యాలయం వద్ద ఆయన జెం డా ఊపి ప్రారంభించారు. కష్టాల్లో ఎవ్వరు ఉన్నా ఆదుకోవడంతో తాము ముందుంటామని వర్మ చెప్పారు.

వరద నీటిలోనే రేషన్‌బియ్యం, పంచదార పంపిణీ

గొల్లప్రోలు, సెప్టెంబరు 2: వరద నీటిలోనే గొల్లప్రోలు జగనన్న కాలనీ వాసులకు రేషన్ సరుకుల పంపిణీ చేపట్టారు. రేషన్‌కార్డుదారులకు ఎండీయూ వాహనం ద్వారా సరుకులను పంపిణీ చేసే అవకాశం లేకపోవడం తో సదరు వాహనాన్ని వరద నీటి వద్ద నిలిపివేశారు. అ ందులో ఉన్న బియ్యం బస్తాలు, పంచదారను బోటులో ఎక్కించి జగనన్న కాలనీకి తరలించారు. అక్కడకు ఎం డీయూ ఆపరేటర్, సిబ్బంది వెళ్లి రేషన్ సరుకుల పంపిణీ చేస్తున్నారు. అలాగే గొల్లప్రోలు జగనన్న కాల నీకి వార్డు సచివాలయ సిబ్బంది బోటు ద్వారా చేరుకుని అక్కడ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ములు అందజేశారు.



ఎండీయూ వాహనం ద్వారా బియ్యం బస్తాలను బోటు లోకి ఎక్కిస్తున్న దృశ్యం

బాధితులకు అండగా ఉంటాం

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు యనమల దివ్య, వరుపుల సత్యప్రభ





తొండంగి: బోటులో వెళ్లి బాధితులను పరామర్శిస్తున్న దివ్య, శంఖవరం: ముంపు ప్రాంతాలు పరిశీలిస్తున్న సత్యప్రభ

తొండంగి, సెప్టెంబరు 2: భారీ వర్షాల కార ణంగా ముంపునకు గురైన తీర ప్రాంత గ్రామా ల్లో తుని ఎమ్మెల్యే యనమల దివ్య సోమవారం పర్యటించి బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీనిచ్చారు. రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికార్లతో కలిసి కృష్ణాపురం, ఒంటిమామిడి, పెరుమాళ్ళపురం పంచాయితీ ప రిధిలోని హవాల్దారు పాడు, బుచ్చియ్యపేట లక్ష్మ ణుపేట, కోదాడ, ఏకొత్తపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. హవాల్దారుపాడులో ముంపునకు గురైన ప్రాంతంలోని ప్రజలను బోటుపై వెళ్లి పరామర్శించారు. ఆహారం, మంచినీటిని అందిం చారు. కోదాడ ఉప్పు చెరువును పరిశీలించారు. పారదర్శకంగా ప్రతి రైతుకు మేలు చేకూరేలా నష్టం నమోదు చేయాలని అధికారులకు సూచిం చారు. సీనియర్ నేతలు యనమల రాజేష్, కొ య్యా రామకేశవ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు కోడ వెంకటరమణ, టీడీపీ మండలా ధ్యక్షులు చొక్కా అప్పారావు, మహంకాళి, పె ద్దాపురం ఆర్డీవో సీతారామారావు పాల్గొన్నారు.

తుని రూరల్: తుని తాండవ సమీపాన గల కాలనీకి ఎమ్మెల్యే యనమల దివ్య వెళ్లి ప్రజల బాధలు అడిగి తెలుసుకున్నారు. తాండవ పరివా హక ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. అనంతరం హంసవరం, జిల్లేడుపాడు గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.

శంఖవరం: కత్తిపూడిలో ముంపుప్రాంతాల ప్రజలతో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాల కారణంగా నష్టపోయినవారిని గుర్తించాలని రెవెన్యూ సిబ్బం దికి ఆదేశించారు. వారిని ఆదుకునేందుకు అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు, బద్ది రామారావు, ఉల్లి వీరభద్రరావు, కీర్తి సుభాష్, కొయ్యా రమణ, కొయ్యా వీరసత్యనారాయణ, గా బు కృష్ణ, కేశంగి జనార్ధన్, నక్కా శ్రీను ఉన్నారు.

భారీ వర్షాలకు తీరని నష్టం

పలు గ్రామాల్లో నీటి ముంపులో పొలాలు



ప్రత్తిపాడు: రౌతుపాలెం అరటితోటలో నీరు

ప్రత్తిపాడు/జగ్గంపేట/కిర్లంపూడి, సెప్టెంబరు 2: ప్రత్తిపాడు మండలంలోని వరి, అరటి, కూర గాయల పంటలకు తీరని నష్టం వాటిల్లింది. గత 3 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రత్తి పాడు, రాయవరం, లంపకలోవ, పెదశంకర్ల పూడి, చినశంకర్లపూడి, ఏలూరు, జగన్నాధపురం, ఉత్తరకంచి, పెద్దిపాలెం, ఒమ్మంగి గ్రామాల్లో 800 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లింది. పెదశంకర్లపూడిలో ఎర్రకాలువ పొటెత్తడంతో వరి పొలల్లో ఇసుక మేటలు పెద్ద ఎత్తున మేట వేయడంతో రైతులకు తీరని నష్టం కలిగించాయి. పోతులూరు, వాకపల్లి, శరభవరం, రౌతుపాలెం, వేములపాలెం గ్రామాల్లో కూరగాయలు, అరటి పంటలను వరద నీరు ముంచెత్తడంతో నష్టం వాటిల్లింది. జగ్గంపేట వ్యవసాయ శాఖ ఏడీఏ వైవీ గంగాధర్, వ్యవసాయాధికారుల బృందం మండలంలోని పెద్దతిన్న పంట పొలాలను సందర్శించారు. ప్రత్తిపాడు మండలంలో సుద్ద గడ్డపొంగు ప్రవహిస్తోంది. జగ్గం పేట మండలం రామవరం, మర్రిపాక,కాట్రావులపల్లి గ్రామాల మధ్య ఏలేరు పరివాహక నీరు చేరడంతో పాటు వర్షం దిగువకు వెళ్ళకపోవడంతో సుమారుగా 200 హెక్టార్ల వరకు వరి పంట నీట మునిగిం దని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిర్లంపూడి మండలంలోని బూరుగుపూడి, గోనేడ, తామరాడ, శృంగరాయునిపాలెంలో నీటముని గిన పొలాలను జిల్లా వ్యవయాధికారి ఎన్.విజయ్‌కుమార్ పరిశీలించారు. మండలంలో సుమారు 850 ఎకరాలకు పైబడి నీటమునిగి నట్టు అధికారులు తెలిపారు. పెద్దాపురం ఎడిఏ ఎన్.ద్రైవ కుమార్, ఏవో అమృత ఉన్నారు.

నీరు నిలిచిపోకుండా చర్యలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 2: భారీ వర్షాల నేపథ్యంలో నగరంలోని లోతట్టు ప్రాంతా ల్లో ముంపునీరు, రోడ్లపై వర్షపు నీరు నిలిచిపో కుండా చర్యలు చేపడుతున్నట్టు నగరపాలక సం స్థ కమిషనర్ భావన అధికారులకు సూచించా రు. జగన్నాధపురం, మహాలక్ష్మినగర్‌లోని అవుట్ ఫాల్ డ్రైయిన్లను కమిషనర్ పరిశీలించారు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా డ్రైయి న్లను శుభ్రపరచాలని సూచించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాం బాబు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'కాయగూర పంటలను ఒబ్బిడి చేసుకోవాలి'

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 2: వరద ముంపు ప్రాంతాల్లో కాయగూరల పంటల్లో కాయకోత చేపట్టి పంటలను ఒబ్బిడి చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి మల్లిఖార్జునరావు సూచించారు. చెందుర్తిలో వరద ముంపునకు గురైన కాయగూరల పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. వరద నీరు పూర్తిగా తగ్గిన వెంటనే తెగుళ్ల నివారణకు సీవోసీ లేదా మాకోజెబ్ వంటి మందులను పిచి కారీ చేసుకోవాలన్నారు. పోషకాలు కొట్టుకుపోతాయని, దీని దృష్ట్యా ఎరువులు వేసుకోవాలని చెప్పారు.



పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ నుంచి తిరుపతికి కాలినడకన పాదయాత్ర

కాకినాడ సిటీ, సెప్టెంబరు 2: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాకినాడ నుంచి తిరుపతికి కాలినడకన వస్తామని మొక్కుకున్న కార్యకర్తలు చిలుకూరి వెంకటేశ్వరరా వు, లక్ష్మణ్‌ల బృందం పాదయాత్రను సోమవారం స్థానిక జగన్నాధపురం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జెండా ఊపి ప్రారం భించారు. వారికి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీ ర్వాదాలు అందించారు. టీడీపీ నాయకులు పాలిక నాని, మేడిశెట్టి ఈశ్వరరావు, పెదపూడి కుమార్, నల్లూరి తులసి శ్రీనివాస్, బోళ్ల కృష్ణమోహన్, సంగిశెట్టి అశోక్, అమన్‌జైన్, నులుకుర్తి సాయి, మేడిశెట్టి బుజ్జి, రమణ తదితరులున్నారు.

యువకుల పాదయాత్రకు స్వాగతం

తుని రూరల్, సెప్టెంబరు 2: పశ్చిమబెంగాల్‌లోని కోల్‌క తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిర సిస్తూ విజయవాడకు చెందిన యువకులు ఆకేటి బుజ్జిబా బు, దంతా రాధాకృష్ణ విజయవాడ నుంచి కోల్‌కత్తా వరకూ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర సోమవారం తుని మం డలం టి.తిమ్మాపురం గ్రామం చేరుకుంది. టి.తిమ్మాపురం గ్రామపెద్దలు కాపారపు అబ్బులు, అత్తి అచ్యుతరావు, పెంకే దుర్గారావు, నరిసే మాణిక్యాలరావు, ఆవాల బుజ్జి, ఆవాల శ్రీను స్వాగతం పలికి సహాయ సహకారాలు అందించారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

అన్నవరం, సెప్టంబరు 2: సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా సోమవారం ప్రత్యేకపూజలు పంచామృతాభిషేక ములు నిర్వహించారు. వేకువజామున 2గంటలకు మూలవ రులను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచ రింపచేశారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకములు అనం తరం పంచామృతాలతో అభిషేకించారు. నూతన పట్టువ స్త్రాలు ధరింపచేసి ముత్యాల వస్త్రాలలో (ముత్తంగి) అలంకా రంలో భక్తులను దర్శనానికి అనుమతించారు. యాగశాలలో ఆయుష్యహోమం చేపట్టగా 11గంటలకు పూర్ణాహుతి గావిం చారు. చైర్మన్ రోహిత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో సోమవారం అమావాస్య సం దర్భంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. చతుర్వేదపం డితుల వేదాశీర్వచనాల అనంతరం తీర్థప్రసాదాలందజేశారు.

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

తాళ్లరేవు, సెప్టెంబరు 2: పిల్లంక ఇసుకర్యాంపు నుంచి ఏ అనుమతులు లేకుండా 40 టన్నుల ఇసుకను తరలిస్తున్న లారీని సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. యానాం నియోజకవర్గం కనకాలపేట కోన సతీష్‌కు చెందిన ఇసుకలా రీలో ఇసుకను తహశీల్దార్ కార్యాలయంలో దిగుమతి చేసి లారీని కోరింగ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

పోషకాహార మాసోత్సవాలు

పిఠాపురం, సెప్టెంబరు 2: పిఠాపురంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో రాష్ట్రీయ పోషకాహార మాసోత్స వాల కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గా దేవి ప్రారంభించారు. ఎంపీడీవో చిన్నారావు, ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జయరాం ఉన్నారు.

మొక్కలు అందజేత

గండేపల్లి, సెప్టెంబర్ 2: క్లీన్ ఆంధ్రా గ్రీన్ ఆంధ్ర కార్యక్ర మంలో భాగంగా ఆదిత్య యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్ యూ నిట్ ఆధ్వర్యంలో సూరంపాలెంలో మొక్కలు పంపిణీ చేసి నట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపా రు. అలాగే గ్రామంలో మొక్కలు నాటడం జరిగిందన్నారు.